ప్రజాశక్తి

ఆదివారం 30 ఏప్రిల్ 2023

5

పార్వతీపురం మన్యం



ఐసిడిఎస్‌లో పోస్టుల భర్తీ

పార్వతీపురం రూరల్ : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని గోపాలపురం, పులిగుమ్మి, బందలుప్పి-1, గోచెక్క-1 అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ సహాయకులు, పార్వతీపురం మండలం సీతంపేటలో మినీ కార్యకర్త, కొమరాడ ప్రాజెక్ట్ పరిధిలోని సరుడుగూడలో అంగన్వాడీ కార్యకర్త, దర్సింగిలో మినీ అంగన్వాడీ కార్యకర్త, కూనేరు, సిఖవరం, దుగ్గిలో ఒక్కో అంగన్వాడీ సహాయకురాలి పోస్టుల ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయగౌరి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన వివాహిత మహిళలు మే 1 నుండి 8న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను సంబంధిత ప్రాజెక్ట్ కార్యాలయాల్లో సమర్పించాలని తెలిపారు. భర్తీ నిబంధనల ప్రకారం వచ్చిన దరఖాస్తుదారులు మాత్రమే ఇంటర్వ్యూకు పిలుస్తామన్నారు. పదో తరగతి పాసై, 21-35 ఏళ్ల వయసు గల స్థానికంగా నివాసం కలిగిన వివాహిత మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

జెఇఇ మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థులు

ప్రజాశక్తి-విలేకర్లు

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. పలువురు విద్యార్థులు వందలోపు ర్యాంకు సాధించి విద్యలనగరం సత్తాచాటారు. విజయనగరానికి చెందిన ఎస్.మౌనిష నాయుడు ఆలిండియా ర్యాంకు 142, ఒబిసి ర్యాంకు 28 సాధించింది. ఎల్.లావణ్య ఆలిండియా ర్యాంకు 349, ఒబిసి 55, సిహెచ్‌వి యశ్వంత్ ఆలిండియా ర్యాంకు 785, ఒబిసి 130 ర్యాంకు సాధించారు. బొబ్బిలికి చెందిన మరడాన అనుశ్రీ ఆలిండియా ర్యాంకు 147, ఒబిసి 70వ ర్యాంకు, కె.వంశీకృష్ణ ఆలిండియా ర్యాంకు 814, ఒబిసి 137 ర్యాంకు సాధించారు. విజయనగరం తోటపాలెం వైఎస్ఆర్ కాలనీకి చెందిన పతివాడ సాత్విక్ 98.37 పర్సంటేల్‌తో 4650వ ర్యాంకు సాధించాడు.

శృంగవరపుకోట :జామి మండలం తానవరం గ్రామానికి చెందిన వర్రి హోమప్రమోద్ ఓపెన్ కేటగిరిలో 332 ర్యాంకు, ఒబిసి కేటగిరిలో 50వ ర్యాంకు సాధించాడు. విశాఖలోని నారాయణ కళాశాలలో చదువుకున్న ప్రమోద్ అడ్వాన్సు పరీక్షలు మంచి ర్యాంకు సాధించి ఐఐటి ఢిల్లీలో బిటెక్ కంప్యూటర్ చదువుతానని తెలిపాడు.

బలిజిపేట మండలంలోని అరసాడకు చెందిన వంగపండు సాయి సూర్య ప్రకాష్‌కు శనివారం వెలువడిన జెఇఇ మెయిన్స్‌లో ఓపెన్ కేటగిరీలో 72వ ర్యాంకు, ఒబిసి కేటగిరిలో 11వ ర్యాంకు సాధించాడు. గతంలో కూడా జెఇఇ మెయిన్స్ ఆర్కిటిక్‌లో 99.973 మార్కులతో ఆలిండియా విభాగంలో 2వ ర్యాంకు సాధించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు వెంకటనాయుడు, మోహిని కుమారుడిని అభినందించారు. ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

సత్తాచాటిన చైతన్య విద్యార్థులు

విజయనగరంలోని శ్రీచైతన్యకళాశాలలో పలువురు విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని కళాశాల డీన్ ఎ.శ్రీనివాసనాయుడు, ప్రిన్సిపాల్ ఆర్.శ్రీధర్ తెలిపారు. నడుపూరు శ్రీనివాస్ 99.13 పర్సంటేల్, సారికి భరత్‌కుమార్ 98.49 పర్సంటేల్ సాధించారు. 21మంది విద్యార్థులు 94 పర్సంటేల్‌పైన సాధించారు. ఈ సందర్భంగా వీరిని డీన్, ప్రిన్సిపాల్, ఎఒ మధుసూదనరావు అభినందించారు.

సాలూరు: పట్టణానికి చెందిన విద్యార్థి ఉప్పల వెంకట విష్ణువర్ధన్ రాజు జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించాడు. విశాఖపట్నంలోని శ్రీ విశ్వ కాలేజీలో చదువుకున్న విష్ణువర్ధన్‌రాజు జెఇఇ మెయిన్స్‌లో 99.91శాతం సాధించాడు. ఓపెన్ కేటగిరీలో 1128,ఇడబ్ల్యుసి కేటగిరీలో 113ర్యాంక్ సాధించాడు.పట్టణంలో వ్యాపారి ఉప్పల తాతాజీ కుమారుడు. ఉత్తమర్యాంకు సాధించడంపై ఆయన కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

దాక్షిణ్యకు జెఇఇలో 2284 వ ర్యాంకు

నెల్లిమర్ల :మండలంలోని గరికిపేట గ్రామానికి చెందిన మహంతి దాక్షిణ్య జెఇఇ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చింది. ఈమె ఒబిసి కేటగిరిలో 2284వ ర్యాంకు సాధించి సత్తా చాటుకుంది. తల్లిదండ్రులు వెంకటరావు, శ్రీదేవితో పాటు గ్రామస్తులు ఆమెకు అభినందనలు తెలిపారు. దాక్షిణ్య తండ్రి వెంకటరావు ఎల్ఐసి ఏజెంటు కాగా తల్లి శ్రీదేవి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. దాక్షిణ్య విశాఖపట్నంలోని శ్రీచైతన్య కళాశాలలో చదువుతున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు

సత్తా చాటిన వీరఘట్టం కుర్రోళ్లు

వీరఘట్టం : జెఇఇ మెయిన్స్ ఫలితాలు బుధవారం వెలువడడంతో వీరఘట్టానికి చెందిన ముగ్గురు కుర్రోలు తమ సత్తా చాటుకున్నారు. ఇందుకు సంబంధించి వారణాసి దీపేస్ 99.97, వడ్డాది శ్రీసూర్య గుణవంత్ 99.68, మజ్జి యువరాజు 98.698 మార్కులతో ఉత్తీర్ణత సాధించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సూర్యప్రకాశ్ 72వ ర్యాంకు

ప్రమోద్ 332వ ర్యాంకు

దాక్షిణ్య 2284వ ర్యాంకు

ఎన్.శ్రీనివాస్(99.13)

దీపేష్ (373ర్యాంకు)

శ్రీసూర్య (99.68)

వైద్య పరికరాలు వినియోగంలో ఉండాలి

ఏరియా ఆస్పత్రిలో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి- పాలకొండ

చిన్న పిల్లల వైద్య పరికరాలు వినియోగంలో ఉండాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక ఏరియా హాస్పిటల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిశుభ్రతలో రాజీ పడరాదన్నారు. రోగులకు మందుల పంపిణీ, వైద్య సేవలు అందుతున్న తీరును పరిశీలించారు. ల్యాబ్ నిర్వహణ, రక్త నమూనాల సేకరణ, రక్త నమూనాల నిల్వ ఉంచు పరికరాలు, మందుల నిల్వ, నిర్వహణ, రిజిస్టర్‌లలో నమోదును వివరంగా తనిఖీ చేశారు. రోగులకు సమయానికి ఆహారం పంపిణి చేస్తున్నదీ లేనిది పరిశీలించారు. జనరేటర్ పనితీరు, సిబ్బంది వివరాలు పరిశీలించారు. వైద్యుల అందుబాటు, విధులకు హాజరు పై ఆరా తీసారు. బేబీ ఇంక్యుబెటర్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఒపి నమోదు వివరాలు అడిగారు. బేబీ ఇంక్యుబెటర్‌తో సహా ఆసుపత్రుల్లో అన్ని పరికరాలూ వినియోగంలో ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అల్ట్రా స్కానింగ్ ప్రింట్ రావాలని, మరమ్మతులలో ఉంటే పునరుద్ధరణ చేయాలని ఆయన పేర్కొన్నారు. బేబీ వార్మర్‌లు పనిచేయాలన్నారు. ఆసుపత్రిలో వైద్య సేవలు నిరాటంకంగా సాగడానికి విద్యుత్ నిరంతరం సరఫరా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఆసుపత్రిలో సంతృప్తికర వైద్య సేవలు అందాలన్నారు.

ఆస్పత్రిలో రోగుల బంధువులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రతి శనివారం నిర్వహించే "గృహ నిర్మాణ దినోత్సవం" సందర్భంగా లుంబూరు గృహ నిర్మాణ కాలనీని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలకు అనుకూల వాతావరణం ఉందని, ఇదే సమయంలో నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మే నెలాఖరు నాటికి అన్ని గృహాలు పూర్తి చేయాలని, లబ్ధిదారులు సొంత ఇంటిలో ఉండాలని ఆయన తెలిపారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. లే అవుట్ కాలనీలో ఉండటం వల్ల ప్రణాళికాబద్ధంగా ఉంటుందని ఆయన చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు కూడా మంజూరు చేస్తున్నామన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో గృహ నిర్మాణాలు వేగవంతం అవుతున్నాయని లుంబూరులో కూడా త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. అనంతరం సీతంపేటలో టిటిడి నిర్మించిన వేంకటేశ్వర ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా భద్రత తదితర అంశాలను సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ బి.వాగ్దేవి, గృహ నిర్మాణ సంస్థ కార్యనిర్వహణ ఇంజినీర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ'ని నిర్వీర్యం చేయొద్దు

15న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధిహామీ చట్టానికి నిధులు తగ్గిస్తూ నిర్వీర్యం చేస్తోందని, ఒక్క పూటే పనులు నిర్వహించాలని, వేసవి భృతి కల్పించాలని కోరుతూ ఈనెల 15న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు ఎపి వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గంగునాయుడు తెలిపారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో రెడ్డి ఈశ్వరరావు అధ్యక్షతన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ గంగు నాయుడు మాట్లాడుతూ వామపక్షాలు, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల పోరాటం వల్ల ఉపాధి హామీ చట్టం వచ్చిందని, ఈ చట్టం వచ్చిన తర్వాత వ్యవసాయ కూలీలకు వ్యవసాయ పనుల్లో కూడా పనులు, కూలీ పెరిగిందని అన్నారు. ఈరోజు కౌలు రైతులు, రైతులు, వ్యవసాయ కూలీలు, వలస కూలీలు, నిరుద్యోగ యువతీ యువకులు, ఉపాధి పనులపై ఆధారపడి గ్రామాల్లో జీవనం సాగిస్తున్నారన్నారు. అటువంటి ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి బిజెపి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. కరోనా సమయంలో సుమారు 15 కోట్ల మంది వలస కూలీలు గ్రామాల్లోకి వచ్చారని, వీరందరికీ ఉపాధి ఎంతో ఆసరాగా ఉందని, అలాగే గ్రామాల్లో నిరుద్యోగ యువతీ యువకులు డిగ్రీలు, పీజీలు చేసిన వారు కూడా ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఇంత కీలకమైన ఉపాధి చట్టాన్ని పనులను నిర్వీర్యం చేయడానికి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రెండు పూటలా పని పెట్టడం వల్ల కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత నెల రోజులుగా జిల్లా వ్యాప్తంగా వడదెబ్బలకు గురై గరుగుబిల్లి మండలం నాగూరులో ఎచ్చెర్ల లక్ష్మి వడదెబ్బకు గురై ఉపాధి పనిలో చనిపోయిందన్నారు. అలాగే గతంలో ఇచ్చిన వేసవి అలవెన్సులు, మేట్లకు ఇచ్చిన ప్రోత్సాహకాలు, మంచినీరు, మజ్జిగ, ఇవేవీ ఇవ్వకుండా ఈ పనులు తమకు వద్దు బాబోయ్ అని వ్యవసాయ కూలీలతో అనిపించేలా బిజెపి ఇన్ని ఇబ్బందులకు గురి చేస్తుందని విమర్శించారు. దీనికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహకరిస్తున్నారన్నారు. కావున ఉపాధి పనులు నిలబెట్టుకోవడానికి కూలీలంతా కలిసికట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మే 15న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో వ్యవసాయ కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు చింతల తవిటి నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై సిబ్బందిని వివరాలు అడుగుతున్న ఇన్‌ఛార్జి జెసి విష్ణుచరణ్

జగనన్న లేఅవుట్ల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాశీపేట జగనన్న లేఔట్ కాలనీ జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ కాలనీకి సంబంధించిన మౌలిక సదుపాయాలైన విద్యుత్, తాగునీరు, రోడ్లు సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇంటికి అయ్యే ఖర్చు కోసం కూడా అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులంతా వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం పేదల కోసం నిర్మిస్తున్న జగనన్న లేఔట్‌లో ప్రతి పేదవాడు సొంత ఇళ్లు కట్టుకోవాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుందన్నారు. అనంతరం పంపవలస, నీలకంఠాపురంలో రీ సర్వే పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ సర్వే పూర్తి అయిన గ్రామాల్లో సర్వే రాళ్లు వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రీ సర్వే చేస్తున్న గ్రామాల్లో పనులు వేగవంతం చేస్తూనే సర్వే రాళ్ళు పాతడంలో చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.ఆయనతో పాటు తహశీల్దార్ ఎంవి రమణ, ఎంపిడిఒ ఎంఎస్ఎల్‌వి ప్రసాద్. హౌసింగ్ పీడీ రఘురాం, డిఇ వర్మ, ఎఇ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో ఛార్జిషీటు దాఖలు చేయాలి

నేరసమీక్షా సమావేశంలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

పోక్సో, మహిళలపై జరిగిన నేరాలపై నిర్ణీత సమయంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఎస్‌పి విక్రాంత్‌పాటిల్ ఆదేశించారు. శనివారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో డిఎస్‌పిలు, సిఐ, ఎస్ఐలతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లులో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక కార్యాచరణతో కేసుల దర్యాప్తును పూర్తి చేయాలని ఆదేశించారు. దర్యాప్తులో ఉన్న గ్రేవ్, ఎస్‌సి, ఎస్‌టి, ఎన్డిపిఎస్, మహిళలపై నేరాలు, కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. గంజాయి, నాటుసారా రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఓపెన్ డ్రింకింగ్, డ్రింక్ అండ్ డ్రైవ్ విధిగా నిర్వహించాలని, ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐ రాడ్ అప్లికేషను, ఎస్. హెచ్. ఆర్.సి., ఎన్. హెచ్. ఆర్.సి ఫిర్యాదులపై తక్షణం స్పందించాలన్నారు. ముఖ్యంగా కోర్టులో ట్రైల్‌కు వచ్చిన కేసులను స్టేషన్ ఎస్‌హెచ్ఒ, సిఐ, డిఎస్‌పి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని సూచించారు. కోర్టు వాయిదాలకు సాక్షులు సక్రమంగా హాజరవుతున్నారా లేదా, వారిని ఎవరైనా ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉన్నదా అన్న సమాచారాన్ని కోర్ట్ కానిస్టేబుల్ ద్వారా తెలుసుకొని, సాక్షులు నిర్భయంగా జరిగిన వాస్తవాన్ని న్యాయమూర్తి ఎదుట ధైర్యంగా చెప్పేలాతర్ఫీదు ఇవ్వాలన్నారు. స్టేషన్‌లో కేసులు కట్టి ముద్దాయిని అరెస్ట్ చేసినంత మాత్రాన బాధితులకు న్యాయం జరిగినట్లు భావించకూడదని, ఎప్పుడైతే ముద్దాయిపై మోపబడిన నేరాన్ని సరైన సాక్షాదారులతో కోర్టులో రుజువు చేసి ముద్దాయికి జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామో అప్పుడే, బాధితులకు సరైన న్యాయం చేసినట్లవుతుందని తెలియజేసారు. ఎపిపిలు ఈ సందర్భంగా మాట్లాడుతూ కోర్టులో జరిగే వాదనలు, ప్రతివాదనలు, కోర్ట్ మానిటరింగ్ వంటి వాటి గురించి వివరించారు. సమావేశంలో ఎఎస్పీలు డాక్టర్ ఓ.దిలీప్ కిరణ్ , సునీల్ షరోన్, పాలకొండ డిఎస్‌పి కృష్ణారావు, దిశా డిఎస్పీ ఎస్ఆర్ హర్షిత, ఎఆర్ డిఎస్పీ నాగేశ్వరరావు, ఎస్‌బి సిఐ ఎన్.శ్రీనివాస రావు , ఎపిపి కిమిడి చంద్ర కుమార్ , జి.వెంకట రమణ, సిఐలు, ఎస్ఐలు, ఐరాడ్ టీం శ్రీధర్ పాల్గొన్నారు.

వాగ్వివాదం చేసుకుంటున్న కమిసనర్, మున్సిపల్ వైస్‌చైర్మన్

కాలనీ స్థలంపై ఘర్షణ

కమిషనర్‌తో కౌన్సిలర్ల వాగ్వివాదం

సాలూరు : మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలంపై వైసిపి కౌన్సిలర్లు, కమిషనర్ శంకరరావు మధ్య వాగ్వివాదం జరిగింది. శనివారం చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అజెండాలో ఉన్న అంశాలను సభ్యులు ఆమోదించారు. జీవో అవర్‌లో 14వార్డు కౌన్సిలర్ పి.మధుసూధనరావు మాట్లాడుతూ బంగారమ్మ కాలనీలో ఉన్న స్థలం ఆక్రమణపై అధికారులను ప్రశ్నించారు. ఆక్రమణదారులపై చర్యలు ఎందుకు తీసుకోలేదన్నారు. దీనికి కౌన్సిలర్ గొల్లపల్లి వరప్రసాద్ మద్దతు పలికారు. వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు కూడా కమిషనర్ శంకరరావును నిలదీశారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ గతంలో ఈ స్థలంలో రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారని, అయినా ప్రభుత్వ స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకున్నామని, నిర్మాణ పనులను కూడా నిలిపివేశామని చెప్పారు. దీనికి వైస్‌చైర్మన్ అప్పలనాయుడు స్పందిస్తూ పట్టాలను ఎందుకు రద్దు చేయలేదని నిలదీయగా, పట్టాలు మంజూరు చేసే, రద్దు చేసే అధికారం తనకు లేదని కమిషనర్ సమాధానం చెప్పారు. సమావేశంలో వైస్ చైర్ పర్సన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు గిరిరఘు, గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, రాపాక మాధవరావు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంచేందుకు కృషి : డిఇఒ

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఇన్చార్జి డిఇఒ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. పాఠశాలకు వస్తున్న విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. అప్పుడే విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. అలాగే ప్రతి ఉపాధ్యాయుడు పాఠ్యాంశాన్ని బోధించే ముందు పాఠ్య ప్రణాళికను తయారు చేసుకొని విద్యార్థులకు పాఠాలు బోధించాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు డ్రెస్ కోడ్‌ను తప్పకుండా పాటించాలన్నారు. ప్రతి నెలా విద్యార్థులకు బోధించే పాఠ్యాంశాలను ముందుగా సన్నద్ధమై విద్యార్థులకు బోధించాలన్నారు. అనంతరం ఆయన ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళికలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఎం.సీతన్న ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిడ్డిక భీముడు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి డిఇఒ ను కలిసిన సామల

జిల్లా ఇన్‌ఛార్జి విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సి వెంకటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఎపి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం శనివారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంఘం రూపొందించిన డైరీని ఆయనకు అందజేశామన్నారు. టెన్త్ సప్లిమెంటరీ స్పాట్ కేంద్రం పార్వతీపురంలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అలాగే పలు ఉపాధ్యాయ సమస్యలను ఇన్చార్జి డిఇఒ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని సామల తెలిపారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి డిఇఒ వెంకటేశ్వరరావు

డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన

సీతంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎస్‌ఇ, సిబిజెడ్, బిఏహెచ్‌ఈపి చదువుతున్న విద్యార్థులు శనివారం పార్వతీపురం ఉద్యానవన కళాశాలను క్షేత్ర పర్యటన చేశారు. లాభసాటి పండ్ల తోటల పెంపకం, పండ్ల తోటల యాజమాన్యం పద్ధతులు గురించి తెలుసుకున్నారు. అనంతరం తోటపల్లి రిజర్వాయర్‌ను సందర్శించి సాగునీటి ప్రాధాన్యతను, చేపల పెంపకం వంటి అంశాలపై అవగాహన పొందారని కళాశాల ప్రిన్సిపల్ పి.జీవనజ్యోతి తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు యు.ఫణి కుమారి, ఎంశంకర్రావు, ఎ.తిరుపతిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని ఎపి అమరావతి జెఎసి పార్వతీపురం మన్యం జిల్లా నాయకులు స్పష్టం చేశారు. శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో పెద్ద ఎత్తున ఉద్యోగులు, ఉద్యోగ సంఘ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చేపట్టిన ఈ ఉద్యమం ఎట్టి పరిస్థితులను కొనసాగిస్తామని, ఐక్య పోరాటాలు కొనసాగిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి డిమాండ్లను సాధించుకుంటామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులుగా ఎపిఆర్ఎస్ఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట రాజేష్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గొట్టాపు శ్రీరామమూర్తి, డిజి ప్రసాద్, నాయకులు అశోక్, చంద్రమౌళి, టివి రమణ, రమణమూర్తి, నారాయణరావు, నర్సింగరావు, ఉమామహేశ్వరరావు, పిఎస్ కుమార్, సిఐటియు నాయకులు వై.మన్మధరావు, రెడ్డి వేణు, వి.ఇందిర, వెంకటరమణ, పదవీ విరమణ చెందిన ఉద్యోగులు అంటిపేట సత్యనారాయణ, గొర్లి అప్పలరాజు ఉద్యోగులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న జెఎసి నాయకులు, ఉద్యోగులు

గ్రామాల్లో ముమ్మరంగా స్టోన్ ప్లాంటేషన్

కొమరాడ: భూ రీ సర్వేలో భాగంగా గ్రామాల్లో ముమ్మరంగా స్టోన్ ప్లాంటేషన్ చేస్తున్నామని తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ అన్నారు. శనివారం మండలంలో కుమ్మరి గుంట పంచాయితీలో స్టోన్ ప్లాంటేషన్‌ను ఆయన పరిశీలించారు. రీసర్వే పూర్తయిని గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. జగనన్న భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా జరుగుతున్న రీసర్వేలో హద్దులు గుర్తింపు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న ఈ కార్యక్రమానికి రైతుల నుంచి సహకారం అవసరమని అన్నారు. ఈ విధానంతో రైతులకు భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయన్నారు. అత్యధిక ఆధునికరణ పరికరాలతో రీ సర్వే చేయడం జరుగుతుందన్నారు. హద్దులు గుర్తింపు స్టోన్ ప్లాంటేషన్ కూడా టెక్నాలజీతో చేయడంతో ఎటువంటి సమస్యలు తగాదాలు లేకుండా ఈ విధానం చేయడం జరుగుతుందని తెలిపారు. రీ సర్వే ఉప తహశీల్దార్, సర్వేర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అసహనమా? అభద్రతా భావమా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నిన్న మొన్నటి వరకు గడప గడపకు ప్రభుత్వం, ప్రస్తుతం పార్టీ పరంగా జగనన్నే మా భవిష్యత్తు వంటి కార్యక్రమాల పేరిట వైసిపి ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తోంది. మునుపెన్నడూ లేనంతగా ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలు తిరుగుతున్నారు. తలుపు తట్టని ఇల్లులేదు. ఎండైనా, వానైనా కార్యక్రమం ఆగితే క్షణాల్లో ఇంటలిజెన్సీ రిపోర్టులు పార్టీ అధిష్టానానికి, సిఎం జగన్మోహన్‌రెడ్డి వెళ్తుండడంతో నేతలు పడరాని పాట్లు పడుతున్నారు. ఇంతకు ముందు కేవలం ఎన్నికల నగరా మోగేకే ఇటువంటి పర్యటనలు ఉండేవి. ఈసారి భిన్నమైన రాజకీయ పరిస్థితులు కనిపిస్తుండడంతో రాజకీయ సలహాదారుల సూచనల మేరకు కొన్ని కార్యక్రమాలు చేపడుతోంది. అందులో జగనన్నే మా భవిష్యత్తు ఒకటి. ఈ కార్యక్రమాల్లో ప్రజల నుంచి తమకు, తమ పార్టీకి సానుకూల స్పందన వస్తుందని చెప్తున్నారు. ఇందులో వాస్తవం ఎంత? అన్నది కాస్త పక్కనబెడితే ఇంటింటికీ వెళ్తున్న కొందరు ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు ప్రజలు స్థానిక సమస్యలపైనా, పథకాలు అందకపోవడంపైనా ప్రశ్నిస్తున్నారు. కొన్నిచోట్ల నిలదీస్తున్నారు. దీనికి సమాధానం చెప్పాల్సిన ఎమ్మెల్యేలు 'చేస్తాం గాబరా ఎందుకు? అంతసీన్ లేదు లే' అంటూ ఎగతాళిగా మాట్లాడడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల బొండపల్లి మండలం వేంద్రం గ్రామంలో ప్రశ్నించిన సాధారణ మహిళపై స్థానిక ఎమ్మెల్యే ఒకింత ఆగ్రహానికి గురయ్యారు. ఈ ఒక్కటే కాదు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఇటువంటి ఘటనలు చోటు చేసు కుంటున్నాయి. ఈనేపథ్యంలో ఎమ్మెల్యేలు కేవలం అసహనం వ్యక్తం చేస్తున్నారా? లేక వ్యతిరేకత, అసంతృప్తి బాహ్య సమాజానికి తెలిసిపోతుందన్న అభద్రతతో వ్యవహరిస్తున్నారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు చేరువయ్యే విధంగా మమేకం అవ్వమంటే నాయకులు, ఎమ్మెల్యేల సమాధానాలు ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదిలా ఉండగా మే 9 నుంచి 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేపడుతున్నారు. ప్రజల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకునేందుకు ఫోన్ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ సేవల్లో సమస్యలు, సలహాలను నేరుగా చెప్పవచ్చు. ఈ కార్యక్రమాన్ని ఎటువంటి స్పందన వస్తుందో వేచి చూడాల్సిందే.

విజయ చిహ్నం చూపిస్తున్న విద్యార్థులు, యాజమాన్య ప్రతినిధులు

జెఇఇలో ఆర్‌కె విద్యార్థులకు ర్యాంకుల పంట

పార్వతీపురం : స్థానిక ఆర్కే జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్ఐటిలో ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ఆర్కే జూనియర్ కాలేజ్ డైరెక్టర్ పి.రామకృష్ణ శనివారం తమ కళాశాల ఆవరణలో పత్రికా విలేకరులతో మాట్లాడారు. 2023 జెఇఇ మెయిన్స్‌లో 20 మందికి గాను 11మంది విద్యార్థులు అర్హత పొందారు, బగ్గాం నికిత 17501, బి.లిఖిత 17964, కోలా అభిషేక్ 23630, ఉదయిని సంజయ్ 26331, కొట్టకోట సాయిసంతోష్ 28832, గెంబలి సాయి భార్గవి 33993 ర్యాంకులను సాధించి జిల్లాలో తమ కళాశాలకు మంచి గుర్తింపు తెచ్చారన్నారు. ఎన్ఐటిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను, అర్హత సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కళాశాల అధ్యాపకులతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్కే జూనియర్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రమిస్తున్న కురుపాం వాసులు

కోట రక్షణ కోసం ఉద్యమం

కురుపాం : దశాబ్దాల చరిత్ర కలిగిన కురుపాం కోటను పరిరక్షించుకునేందుకు కురుపాం, శివన్నపేట గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ఈ మేరకు తమ ప్రయత్నాలను ప్రారంభించారు. వివరాల్లోకి వెళ్తే కురుపాం మహారాజా కిషోర్ చంద్రదేవ్ కోటలోని ఓ భాగంలో తన చిన్నాన్న కుమారుడైన ప్రదీప్ కుమార్ దేవ్ నివసించేందుకు కిషోర్‌చంద్ర దేవ్ కొన్ని సంవత్సరాల క్రితం అనుమతిచ్చారు. అయితే శతాబ్దాల చరిత్ర కలిగిన కోట నమూనాలను పాడు చేయరాదని, నూతన నిర్మాణాలు చేపట్టరాదని నిబంధనలు విధించారు. అయితే ఇటీవల జరుగుతున్న కొన్ని పరిణామాలు కురుపాం, శివన్నపేట ప్రజలను ఆందోళనకు గురిచేశాయి. ప్రదీప్‌దేవ్ కోట లోని కొన్ని భాగాలను నేలమట్టం చేయడం, కోట ఆవరణలో నూతన నిర్మాణాలు చేపట్టడంతో కోట క్రమక్రమంగా తన సుందర రూపాన్ని కోల్పోయింది. కురుపాం అనగానే సందర్శకులు కురుపాం కోటను తొలుత సందర్శిస్తారు. అంతటి ప్రాధాన్యత కలిగిన కోట క్రమ క్రమంగా తన ఉనికిని కోల్పోతుండడంతో ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. దీంతో కోటను సంరక్షించాలని, కోట రూపురేఖలు మార్చకూడదని, నినదిస్తూ కురుపాం, శివన్నపేట గ్రామాలకు చెందిన ప్రజలు శనివారం కురుపాం గ్రామ పంచాయతీ వారికి, కురుపాం పోలీసులకు, జిల్లా కలెక్టర్‌కు, జిల్లా పంచాయతీ అధికారులకు వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిమిడి రామరాజు, గౌస్, కన్నా, వి.శ్రీనివాస్, టి. రామారావు, చంటి పాల్గొన్నారు.

నిబంధనల మేరకే పనులు

వీరఘట్టం: నిబంధనల మేరకే ఉపాధి పనులు చేయాలని ఎంపిడిఒ వై.వెంకటరమణ వేతనదారులకు సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని చెరువిడి చెరువులో చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమకు తగ్గ వేతనం లభిస్తుందని వేతన దారులకు తెలిపారు. వేతనంలో ఎటువంటి వ్యత్యాసాలున్నా తమ దృష్టికి తీసుకురావాలని వేతనదారులను కోరారు.

బ్రిడ్జి కింద నీటిని తొలగించాలి

కొమరాడ : మాదల రైల్వే లైన్ అంతర్ బ్రిడ్జి కిందన ఉన్న నీరు వెంటనే తొలగించి ఆటు వాహనదారులకు, గ్రామాలకు ప్రజలకు రహదారి సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలో రైల్వే అండర్ గ్రౌండ్‌లు వద్ద నీరు నిల్వ ఉన్న ప్రదేశాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వర్షం పడినా బ్రిడ్జి కింద నీరు నిల్వ ఉండిపోవడంతో సరుగుడు గూడ, గుమడ రైల్వే స్టేషన్ సమీపంలో నయా పంచాయితీకి వెళ్లే గ్రామాల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీటిని వెంటనే తొలగించకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

కృష్ణమూర్తి సేవలు వెలకట్టలేనివి

పార్వతీపురంటౌన్ : వృద్ధ మిత్ర కో-ఆర్డినేటర్ పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి చేస్తున్న సేవలు వెలకట్టలేనివి అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి అన్నారు. కృష్ణమూర్తి చేస్తున్న సేవలను గుర్తించి శనివారం స్థానిక పాత బస్టాండ్ వద్ద జరిగిన సభలో ఆయనకు దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వృద్ధులను, మహిళలను, వికలాంగులకు సహాయపడడమే కాకుండా పేద విద్యార్థులకు కూడా అండగా నిలుస్తున్నారన్నారు. ఆయన సేవలు అభినందనీయమని, ఆయన్ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని కష్టాల్లో ఉన్న ఇతరులకు సేవలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, కొండపల్లి బాలకష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు మంత్రి రవికుమార్, ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీడి రైతులు మోసపోకుండా చర్యలు

కొమరాడ : ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన జీడి రైతులు మోసపోకుండా చర్యలు చేపట్టేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు ఎపిడి వై.సత్యం నాయుడు అన్నా రు. కొమరాడలో ఏర్పాటు చేసిన జీడిపిక్కల ఫ్యాక్టరీని ఆయన శనివారం పరిశీలించారు. కొమరాడకు చెందిన వినోద్ కుమార్ జీడిపప్పు తయారు చేసే ఫ్యాక్టరీని ఏర్పాటు చేసిన విషయాన్ని తెలుసుకున్న ఆయన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫ్యాక్టరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో అత్యధికంగా లభించే జీడిపిక్కలు ఫ్యాక్టరీకి తరలించి గిరిజనులకు ఆర్థికంగా ఆదుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఏజెన్సీలో జీడి రైతులను దళారులు మోసగించడంతో గిరిజనులు ఆర్థికంగా ఇబ్బందులు పెడుతున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. పార్వతీపురం ఐటిడి పరిధిలో గల అన్ని గిరిజన మండలాల్లో లభించే జీడి పిక్కలను ఫ్యాక్టరీకి తరలించి గిరిజనులకు మద్దతు ధర చెల్లించేందుకు చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధానంతో జీడి రైతులకు ఆదాయంతో పాటు కొంతమంది ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. జీడిపప్పు తయారు చేసే పరిశ్రమను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామన్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఏజెన్సీ ప్రాంతాల్లో లభించే జీడి పిక్కలను కొనుగోలు చేసి జీడిపప్పు తయారుచేసి మార్కెట్లో అమ్మేందుకు చర్యలు చేపడతామని అన్నారు. కావున జీడి రైతులెవరు దళారుల చేతిలో మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఈ పరిశీలనలో ఎడి సీతారాం, డిపిఎం ప్రవీణ్ కుమార్, వెలుగు ఎపిఎం వెంకటరమణ, సిసి సీత తదితరులు ఉన్నారు.

ఫ్యాక్టరీను పరిశీలిస్తున్న ఎపిడి సత్యంనాయుడు

మరోసారి ఆదరించండి

ప్రజాశక్తి - సాలూరు

ఇటీవల తమ పార్టీ నిర్వహించిన మెగా పీపుల్స్ సర్వేలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఎక్కువ మంది ప్రజలు మొగ్గుచూపారని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. తమను మరోసారి ఆదరించాలని కోరారు. జగనన్నే మా భవిష్యత్తు, నువ్వే మా నమ్మకం జగనన్నా కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం స్థానిక లెప్రసీ ఆసుపత్రి కమ్యూనిటీ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 7న ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని 29వరకు కొనసాగించినట్లు చెప్పారు. తనతో సహా వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామంలో ఇంటింటికీ తిరిగి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన మెగా పీపుల్స్ సర్వేలో కనిపించిన ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయని చెప్పారు. నియోజకవర్గంలో 51,829 కుటుంబాలను వైసిపి నాయకుల, కార్యకర్తలు సంప్రదించారని చెప్పారు. 49,196మంది పార్టీ నిర్దేశించిన ఫోన్ నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చారని చెప్పారు. వచ్చేనెల 9నుంచి జగనన్నకు చెపుదాం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, జెడ్పీ వైస్ చైర్మన్ కొర్రజన్ని సింహాచలం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్ రావు, సచివాలయాల కన్వీనర్ గిరిరఘు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి నాయకులు, సర్పంచులు ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీ

జగనన్నే మా భవిష్యత్తు ముగింపు సందర్భంగా శనివారం డిప్యూటీ సీఎం రాజన్నదొర ఆధ్వర్యాన వైసిపి నాయకులు కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. లెప్రసీ కమ్యూనిటీ హాలు నుంచి బయలుదేరి పట్టణ ప్రధాన రహదారి మీదుగా చేశారు. నాలుగు మండలాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు ముగింపులో డిప్యూటీ సీఎం

సాలూరు: బైక్ ర్యాలీ చేస్తున్న డిప్యూటీ సిఎం, వైసిపి నాయకులు

పార్వతీపురం టౌన్ : ఈనెల 7 నుంచి జగనన్నే మా భవిష్యత్తు పేరుతో నిర్వహించిన మెగా పీపుల్స్ సర్వేను ప్రారంభించి శనివారం చివరి రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు శోభా హైమావతితో కలిసి వేలాది మంది వైసిపి శ్రేణులతో ప్రధాన రహదారి గుండా భారీ ర్యాలీ నిర్వహించి పట్టణంలో ఉన్న పాత బస్టాండ్ కూడలి వద్ద బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ, సర్వే ప్రారంభం నుండి నేటి వరకు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా భారీ స్థాయిలో పాల్గొన్నందున సర్వేకు అపూర్వ స్పందన వచ్చిందన్నారు. నియోజకవర్గంలో సర్వేలో భాగంగా 70 వేల కుటుంబాలను సందర్శించామని, 60వేల మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మా నమ్మకం నువ్వే జగనన్న నినాదం మారుమోగుతోందన్నారు. ఈ మెగా పీపుల్స్ సర్వే ఫలితాలు చూసి విపక్షాలకు షాక్ కొట్టినట్టయిందన్నారు. కార్యక్రమంలో మూడు మండలాల జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు, వైస్ఎంపిపిలు, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్లు, మండల పార్టీ అధ్యక్షులు, పట్టణ పార్టీ అధ్యక్షులు, మూడు మండలాలు, పట్టణ జెసిఎస్ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సచివాలయాల కన్వీనర్లు, గహసారథులు, కార్యకర్తలు, స్టేట్ డైరెక్టర్లు, ఎఎంసి చైర్ పర్సన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, వేలాది మంది వైసీపీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీరఘట్టం : జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో 1.68కోట్ల గృహాలు సందర్శించడం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే వీ కళావతి అన్నారు. శనివారం మండలంలోని వండువలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్తు ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి పదిలక్షల మంది నుంచి మిస్డ్ కాల్స్ వచ్చేయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమం పథకాలు ద్వారా అనేకమంది తమను ఆదరించి మా నమ్మకం జగన్ అని అన్నారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డినే ఎన్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కళ్యాణి, ధమలపాటి ఉమా మహేశ్వరరావు, కనపాక సూర్య ప్రకాష్, వెలమల మన్మధ రావు, కడగల వెంకటరమణ, బాసురు కాంతారావు, సవర రాము, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వేసవి సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు తగు శ్రద్ధ చూపాలని ఎటిడబ్ల్యూఒ సురేష్ కుమార్ అన్నారు. స్థానిక కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులకు ఎటిడబ్ల్యూఒ శనివారం ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి వేసవి సెలవులు సద్వినియోగం చేసుకొని పుస్తక పఠనంపై దృష్టి సారించాలని సూచించారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీరంజిని, ఉపాధ్యాయులు ఉన్నారు.

పార్వతీపురం రూరల్ : వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆటపాటలపైనే కాకుండా చదువు పైనా దృష్టి పెట్టేలా తల్లిదండ్రులు అవగాహన కల్పిస్తూ వారిని పర్యవేక్షిస్తూ ఉండాలని ఎన్.ములగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జివి లక్ష్మి అన్నారు. ఈ విద్యా సంవత్సరం ఆఖరు పని దినం సందర్భంగా పాఠశాలల్లో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అలాగే మండలంలోని పెద్దబొండపల్లి, ఎంఆర్ నగరం, నర్సిపురంలోనూ తల్లిదండ్రుల సమావేశాన్ని ఆయా ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందిస్తున్న ఎటిడబ్ల్యూఒ

కొమరాడ : వేసవి సెలవుల్లో పిల్లలకు ఇంటి దగ్గర చదివించేందుకు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి జామి నారాయణస్వామి అన్నారు. శనివారం మాదిలింగి జిల్లా పరిషత్ హైస్కూల్లో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి సెలవుల్లో ముందు రోజున విద్యార్థులకు ప్రభుత్వం ఆదేశించిన మేరకు ప్రోగ్రెస్ కార్డులు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు ఆరోగ్యం పట్ల కూడా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా సెలవులు సమయంలో పిల్లలు ఎటువైపు వెళ్లినా వారిపై తల్లిదండ్రులు నిఘా పెట్టి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థి దశలోనే పిల్లలను క్రమశిక్షణగా ఉంచినట్లయితే వారి భవిష్యత్ తరాలు సుఖంగా ఉంటాయన్నారు. ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు కూడా గ్రామాల్లో సందర్శించి విద్యార్థులు చదువులపై ఆరా తీస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వతీపురం: మాట్లాడుతున్న హెచ్ఎం జివి లక్ష్మి

సీతంపేట : విద్యార్థులు వేసవి సెలవుల్లో శ్రద్ధగా కంప్యూటర్ శిక్షణ పొందాలని ప్రధాన ఉపాధ్యాయులు కొండ గొర్రె సుబ్బారావు అన్నారు. శనివారం దొనుబాయి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో తల్లి దండ్రులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థుల పట్ల సెలవుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలతో అదొరోహించవచ్చునని చెప్పారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు ఉత్తర్వు రావు పాల్గొన్నారు.

బిసి కాలనీలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం: మండల కేంద్రంలోని బిసి కాలనీలో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి గర్భిణీలకు, బాలింతలకు, చంటి పిల్లలకు, రక్తపోటు, మధుమేహం, జ్వర పీడితులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతి కుమారి, ఎఎన్ఎం ఉష, టెక్నీషియన్ దినేష్, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

సీతానగరం: మండలంలోని నిడ గల్లు, వెంకటాపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పను లను ఎంపిడిఒ ఎం ఎస్ఎల్ ప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా వేతనదారుల మస్తర్లను పరిశీలించారు. మస్తర్లో ఉన్న పేర్లకు పనిచేస్తున్న వ్యక్తుల పేర్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతి ఉపాధి కూలీ తమకు నిర్దేశించిన సమయంలోనే పని చేసి ప్రభుత్వ నిర్ణయించిన కూలి పొందాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పీటర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

డిఎస్‌పికి ఘనంగా వీడ్కోలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం డిఎస్‌పిగా పని చేసిన ఎ.సుభాష్‌కు బదిలీ అయ్యిన సందర్భంగా ఎపి ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ సౌమ్యులుగా, స్నేహశీలి గా, విధుల్లో నిబద్ధత గల అధికారిగా సుభాష్ పేరుకున్నారని కొనియాడారు. దాదాపు రెండున్నరేళ్లుగా పార్వతీపురం డివిజన్ ప్రజలకు డిఎస్పీ అందించిన సేవలు ఎంతో అభినందనీయమన్నారు. ప్రజలతో ఎంతో చక్కగా, స్నేహపూర్వకంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో ఆకట్టుకున్నారన్నారు.

కంపు కొడుతున్న ఆర్తాం

ప్రజాశక్తి - కొమరాడ

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కాలువల్లో అపారిశుధ్యం పేరుకుపోవడంతో అర్తం గ్రామపంచాయతీ కంపు కొడుతుందని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలో సక్రమంగా పారిశుధ్య పనులు చేయకపోవడంతో ఎక్కడికక్కడ మురికి నీరు నిల్వ ఉండిపోయి దోమలు పెరిగిపోతున్నాయని గ్రామస్తులంటున్నారు. గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించాలని ప్రభుత్వం చెబుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాలు కంపుకొట్టే పరిస్థితి ఉందని ప్రజలు అంటున్నారు. ప్రజలకు సేవలందించాల్సిన పంచాయతీ కార్యదర్శి ముడుపులు మత్తులో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏ చిన్న పనికైనా ముడుపులు చెల్లిస్తే గానీ పనులు జరగకపోవడంతో ప్రజలు పంచాయతీ కార్యదర్శిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం గ్రామ సచివాలయం కూడా పరిశుభ్రంగా ఉంచడం లేదంటే అధికారుల పనితీరు ఏ విధంగా ఉందో అర్థమవుతుందని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీలో కొత్త విద్యుత్ కలెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలంటే పంచాయతీ కార్యదర్శి ముడుపులు రూ.500 వరకు ముడుపులు చెల్లించాల్సి వస్తుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అలాగే ఇటీవల పంచాయతీలో వసూలు చేస్తున్న ఇంటి పన్ను లెక్కలు కూడా అవకతవకలు జరిగినట్లు స్థానిక నాయకులు నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంటి పన్ను వసూళ్లకు ముందుగా ప్రజలకు డిమాండ్లు నోటీసులు ఇస్తున్నా, డబ్బులు కట్టిన వారికి రసీదులు ఇవ్వకపోవడం చూస్తే ఇంటి పన్ను వసూల్లో కూడా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ .98 వేలు నిధులు పక్కదారి పట్టించినట్లు చర్చ జరుగుతోంది. ఏదిఏమైనా గ్రామంలోని సమస్యలపై పంచాయతీ కార్యదర్శిని అడగ్గా ప్రజలపైనా, నాయకులపైనా దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఈ విషయమై ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావుకు కూడా ఫిర్యాదులు చేసినట్లు ప్రజలు తెలిపారు. తక్షణమే జిల్లాస్థాయి అధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శి తీరుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాలువలో పేరుకుపోయిన మురుగు

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలో శనివారం జరిగిన నవోదయ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఇఒ ఎన్.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 116 మంది విద్యార్థులకు 109 మంది హాజరు కాగా, ఏడుగురు గైర్హాజరైనట్లు తెలిపారు. మోడల్ స్కూల్‌లో 192 మంది విద్యార్థులకు 181 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 11 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగినట్లు తెలిపారు.

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జవహర్ నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీధర్ తెలిపారు. 220 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ 8మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రంలోని కొన్ని గదుల్లో ఫ్యాన్లు తిరగకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అలాగే మండల కేంద్రానికి చెందిన ముద్దాడ రమ్యశ్రీ హాల్ టికెట్ తీసుకురాక పోవడంతో నిర్వాహకులు పరీక్షకు అనుమతి ఇవ్వకపోవ డంతో కొంతసేపు అయిన తర్వాత తండ్రి హాల్ టికెట్ తీసుకువచ్చి ఇవ్వటంతో పరీక్ష రాసింది.

కురుపాం: పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఇఒ

ఏనుగుల గుంపు సంచారం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల శివన్నపేట గ్రామ సమీపంలో ఉన్న సోమసాగరం చెరువులో శనివారం ఉదయం ఏనుగుల గుంపు సంచరిస్తున్నాయి. దీంతో అటువైపు పొలం పనులకు వెళ్లడానికి రైతులు, ఆ చెరువు పక్కనుండి ఉన్న రహదారి వైపు ఉన్న గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించడానికి భయాందోళనలకు గురవుతున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఏనుగులు తమ గ్రామ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయని, తామంతా రైతులమని, వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఈ చెరువుకు ఆనుకొని చుట్టూ పొలాలు ఉన్నాయని ఎప్పుడూ కూడా పొలాల్లో ఉంటామని అటువంటిది పొలాలకు వెళ్లాలంటే భయమేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎప్పుడు ఎటువైపు నుంచి వచ్చి ఏం చేస్తాయోనని ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకోవాల్సి వస్తుందని కావున అటవీ శాఖ అధికారులు స్పందించి తక్షణమే ఏనుగుల బారి నుండి తమ ప్రాణాలను, పంటలను కాపాడి జనజీవనానికి దూరంగా ఉన్న అటవీ ప్రాంతానికి తరలించాలని గ్రామస్తులు కోరారు.

చెరువులో ఉన్న ఏనుగులు

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. శనివారం పట్టణంలోని 15,18,19 వార్డులకు చెందిన అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించి పిల్లల బరువు, ఎత్తు, ఆరోగ్య స్థితి వివరాలకు చెందిన రికార్డులను పరిశీలించారు. గత నెలలో నమోదైన గణాంకాలకు, ప్రస్తుతానికి ఉన్న మార్పును పరిశీలించారు. కొంత మంది పిల్లలు బరువు, ఎత్తును ప్రత్యక్షంగా పరిశీలించి వయస్సుకు తగ్గట్టుగా ఉన్నదీ లేనిదీ పరిశీలించి ఎంసిపి కార్డులో ఉన్న గ్రోత్ చార్ట్‌లో ప్రతి నెలా నమోదు చేయాలని సూచించారు. సాధారణ స్థితిలో లేని వారిని గుర్తిస్తే ప్రత్యేక పర్యవేక్షణ చేసి అవసరమైతే ఎన్ఆర్‌సి కేంద్రానికి పంపించాలని సూచించారు. అనంతరం ఆయన ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్స్, మాత్రలు లభ్యతను పరిశీలించి వారానికి రెండసార్లు తప్పకుండా పిల్లలకు ఐరన్ సిరప్ వేయాలని వివరాలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. వేసవి కాలం రీత్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, జింక్ కార్నర్ ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతినెలా వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది సమన్వయ సమావేశం జరిపి పిల్లల, గర్భిణుల ఆరోగ్యం పై సమీక్ష చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ జయాగౌడ్, ఎఎన్ఎమ్ నారాయణమ్మ, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లాడి ఎత్తు కొలుస్తున్న డిఐఒ జగన్మోహనరావు

మహా సంప్రోక్షం ప్రారంభం

సీతంపేట: మండలంలోని తూరాయిపువలస సమీపంలో టిటిడి దేవస్థానం ఆధ్వర్యంలో సుమారు రూ.5 కోట్లుతో నిర్మించిన టిటిడి ఆలయంలో శనివారం మహా సంప్రోక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 29 నుంచి మే4 వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయి. ఈ కార్యక్రమనికి ఎమ్మెల్యే వి కళావతి హాజరయి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ మునీభూషన రెడ్డి, సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు ఢీకొని ఒకరు మృతి

సీతానగరం: మండలంలోని చినభోగిలి సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. రైల్వే కానిస్టేబుల్ ఈశ్వరరావు అందించిన వివరాలు ప్రకారం మృతుడు పార్వతీపురం మండలం లచ్చిరాజుపేటకు చెందిన శెట్టి శంకరరావు(43)గా ఆయన దగ్గర లభించిన ఆధార్ కార్డు ప్రకారం గుర్తించామన్నారు. శంకరరావు కర్రల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. సీతానగరం స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బొబ్బిలి ప్రభుత్వ హాస్పిటల్ తరలించారు.

మనస్థాపంతో యువకుడి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం రూరల్ : మక్కువకు చెందిన చోడవరపు మహేష్ శనివారం ఉదయం తన ఇంట్లో ఉన్న ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే... చదువుకొని ఏ పనీ చేయకుండా తిరుగుతున్న అతడ్ని తల్లిదండ్రులు పెళ్లి ఈడు వచ్చింది కనుక ఏదో ఒక పని చేయకపోతే పిల్లను ఎవరు ఇస్తారంటూ మందలించి, ఏదో ఒక పని చేసుకోవాలని సూచించారు. దీంతో మనస్థాపం చెందిన మహేష్ ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబీకులు జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

ఉరి వేసుకుని యువకుడు మృతి

వీరఘట్టం : మండలంలోని చలివేంద్రి పంచాయతీ పరిధి మహాదేవివలసకు చెందిన జన్ని వెంకటరమణ (17) గ్రామానికి సమీపానున్న మామిడి తోటలో శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుని పై దాడి

పార్వతీపురంరూరల్ : కొమరాడ మండలం విక్రాంపురానికి చెందిన మీసాల శ్రీనివాసరావుపై అదే గ్రామానికి చెందిన కొంతమంది యువకులు దాడి చేయడంతో గాయాల పాలయ్యాడు. శనివారం ఉదయం ప్రేమ విషయంలో వాసు అనే యువకుడ్ని శ్రీనివాసరావు నిలదీయడంతో వారు అతనిపై దాడి చేశారు. వెంటనే కుటుంబీకులు స్పందించి జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.